సాక్షి జగిత్యాల

9

ఆదివారం । 14 । మే । 2023





అమ్మ యాదిలో..

అమ్మా.. రెండక్షరాల ఆత్మీయ బంధం. సృష్టిలో తొలిదైవం. నూరేళ్ల జీవితానికి మూలకారణం. నవమాసాలు మోసి.. పొత్తిళ్లలో పెట్టుకుని పెంచే అమ్మ ప్రేమ వెలకట్టలేనిది. తాను పస్తులున్నా.. పిల్లల ఆకలి తీరుస్తుంది. కష్టమొస్తే అమ్మ కళ్ల లోంచి కన్నీళ్లు వస్తాయి. బిడ్డలు ఎదిగితే తల్లి మనసు గొప్పగా అనుభూతి చెందుతుంది. అమ్మంటే ప్రేమించనివారు ఉండరు. అమ్మ యాదిలో ఉమ్మడి జిల్లాకు చెందిన చాలామంది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా కథనం. 10లో

న్యూస్‌రీల్

మహాయజ్ఞం



యజ్ఞం చేస్తున్న భక్తులు

కథలాపూర్(వేములవాడ): తాండ్ర్యాల గ్రామంలో మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాయజ్ఞం నిర్వహించారు. దేవాలయ ప్రవేశం చేశారు. అనంతరం భక్తులు యజ్ఞం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అర్చకులు సీతరామాచార్యులు, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులది ఆత్మగౌర పోరాటం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులది ఆత్మగౌరవ పోరాటమని, ప్రభుత్వం చర్చలకు పిలవాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 15వ రోజు నిరసన దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులను విధుల్లో చేరాలని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని ఆయన కోరారు. మహిళా పంచాయతీ కార్యదర్శులకు మెటర్నిటీ లీవ్‌లు కూడా లేవని, రెగ్యులరైజ్ అయితే ఉద్యోగ భద్రత ఉంటుందని అభిప్రాయపడ్డారు. పౌరసమాజం బతికే ఉందని, అన్యాయం జరిగినప్పుడు వెన్నంటి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు సంతోష్, రవళి, వంశీధర్, రాజిరెడ్డి, రాజు, మల్లికార్జున్, నజీమ్, అక్బర్ పాల్గొన్నారు. పలువురు నాయ కులు దీక్షలో కూర్చుని మద్దతు ప్రకటించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ



క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం హనుమాన్ జయంతి కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు ఒకరోజు ముందే నృసింహుని సన్నిధికి తరలివచ్చారు. తొలుత గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్టు




మాల విరమణ చేస్తున్న స్వాములు



ఇరుముడులతో తరలివస్తున్న భక్తులు



ఆలయంలో ఇరుముడులు



అంజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో స్వాములు



కడప నుంచి వచ్చిన హనుమాన్ భక్తులు



ఇరుముడులతో తరలివస్తున్న స్వాములు

వాయుపుత్రా.. వందనం

హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభం

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- కాలినడకన చేరుకున్న స్వాములు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధి జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు వందల కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన కొండగట్టుకు చేరుకున్నారు. వారిరాకతో ఆలయం కాషాయమయమైంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తరలివస్తున్నారు. శనివారం సాయంత్రం వరకే సుమారు 50వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము వరకు మరో రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి మూలవిరాట్టును 11 రకాల పండ్లు, 108 కిలోలతో అలంకరించారు. చందనాలంకారం చేశారు. పంచామృతాభిషేకం నిర్వహించారు. దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. యాగశాలలో హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు జితేంద్రస్వామి, రామకృష్ణ, రఘు, చిరంజీవిస్వామి, మారుతిస్వామి, ఈవో వెంకటేశ్ పాల్గొన్నారు.





విద్యుత్ వెలుగుల్లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, తరలివచ్చిన భక్తులు



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ర్యాలీలు.. రాస్తారోకోలు



కథలాపూర్ రోడ్డుపై బైఠాయించిన యాదవులు

- ఎస్సై అనిల్‌కు మద్దతుగా నిరసనల హోరు
- ప్రశాంతంగా జిల్లా బంద్
- స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు
- కొన్నిచోట్ల నేడు, రేపు కూడా..

జగిత్యాల: ఆర్టీసీ బస్సులో ఇటీవల జరిగిన ఓ సంఘటనలో ఒకవర్గం ఫిర్యాదును స్వీకరించిన పోలీసు శాఖ.. జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను అకారణంగా సస్పెండ్ చేసిందని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్, వివిధ హిందూ సంస్థలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా శనివారం బంద్ ప్రశాంతంగా జరిగింది. జగిత్యాల, రాయికల్, పెగడపల్లి, మల్యాల, జగిత్యాల రూరల్ మండలాల్లో ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచే వాణిజ్య, వ్యాపార సముదాయాలు మూసిఉంచారు. వీహెచ్‌పీ, బజరంగదళ్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎస్సైపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు.. జిల్లాలోని పలు మున్సిపాలిటీలు, మండలాల్లో ఆది, సోమవారాల్లోనూ బంద్ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

జగిత్యాలక్రైం: జాబితాపూర్ గ్రామస్తులు జగిత్యాల – గొల్లపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎస్సైపై మహిళ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయాలే తప్ప ఒక వర్గానికి వత్తాసు పలుకుతూ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ధర్నాతో సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గట్టి బందోబస్తు

బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని అన్నపూర్ణ చౌరస్తా, పాతబస్టాండ్, తహసీల్ చౌరస్తా, టవర్‌సర్కిల్, తీన్‌ఖని చౌరస్తా, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షించారు.

దాహం.. దాహం

జగిత్యాలరూరల్: బంద్ సందర్భంగా భిక్షాటన చేసే వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఓ వృద్ధురాలు దాహం తీర్చుకునేందుకు నల్లా వద్దకు వెళ్లి నీరు తాగుతూ దాహం తీర్చుకుంది.



జగిత్యాల: నిర్మానుష్యంగా మారిన టవర్ సర్కిల్



జగిత్యాలలో పోలీసుల బందోబస్తు



రాయికల్‌లో మూసి ఉన్న దుకాణాలు

రాయికల్‌లో..

రాయికల్(జగిత్యాల): విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో వర్తక, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. ఎస్సై అనిల్‌పై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

యాదవుల ధర్నా

కథలాపూర్(వేములవాడ): ఎస్సై అనిల్‌ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ యాదవ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తమ సంఘ భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్సై శ్వేత సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనను విరమింపచేశారు. యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీపై రైతుల ఆగ్రహం



'విండో' అధ్యక్షుడిని ప్రశ్నిస్తున్న రైతులు

వెల్గటూర్(ధర్మపురి): అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయిందని, మరికొంత వర్షపు నీటిలో కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయిన తమను మిల్లర్లు తరుగు పేరిట మళ్లీ దోపిడీ చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరుగుత, తేమ పేరిట బస్తాపై 3 కిలోల చొప్పున, క్వింటాలుకు సుమారు 8 కిలోల వరకు తరుగు తీస్తూ ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన పాపానికి పాశిగామలో తిమ్మాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో మూడురోజు లుగా ధాన్యం తూకం వేయడం లేదని ఆరోపించారు. ధాన్యంలో కోతకు రైతులను ఒప్పించేందుకు స్వయంగా సహకార సంఘం అధ్యక్షుడు రంగంలోకి దిగి చర్చలు చేయడం గమనార్హం. ఇప్పటికే అన్నివిధాలుగా నష్టపోయిన తమను ఏ నాయకుడూ ఆదుకోకపోగా దగ్గరుండి ఇలా మిల్లర్లకు దోచిపెట్టేందుకు వచ్చారా? అని అధ్యక్షుడిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పిన కర్ణాటక ప్రజలు



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మతతత్వ పార్టీలకు బుద్ధిచెప్పేలా కర్ణాటక రాష్ట్ర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పునిచ్చారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై జిల్లా కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్ చౌరస్తాలో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మతతత్వ విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రచారం కొనసాగించినా.. ప్రజలు పట్టించుకోలేదని అన్నారు. భారత జాతీయ ఐక్యతను నిలబెట్టేలా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర రాజకీయాల్లో తీవ్ర ప్రభావం చూపిందని ఏర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ అలీ, నాయకులు దుర్గయ్య, శంకర్, రాజేందర్, శ్రీనివాస్, దయ్యాల శంకర్ పాల్గొన్నారు.

అమ్మయాదిలో..

మాతృమూర్తి పేరిట సేవాసంస్థలు

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాలు
- అనాథాశ్రమాలు.. ట్రస్టుల ద్వారా చేయూత
- తల్లిపేరు చిరకాలం గుర్తుండేలా సేవా
- నేడు మదర్స్ డే

అమ్మా.. రెండక్షరాల ఆత్మీయ బంధం. సృష్టిలో మొదటిదైవం. మనిషి నూరేళ్ల జీవితానికి మూలకారణం. నవమాసాలు మోసి.. పొత్తిళ్లలో పెట్టుకుని పెంచే అమ్మప్రేమ వెలకట్టలేనిది. తాను పస్తులున్నా.. పిల్లల ఆకలిని తీరుస్తుంది. కష్టమొస్తే అమ్మ కళ్లలోంచి కన్నీళ్లు వస్తాయి. బిడ్డలు ఎదిగితే తల్లి మనసు సంతోషం వ్యక్తం చేస్తుంది. అలాంటి అమ్మంటే ఈ ప్రపంచంలో ప్రేమించనివారు ఉండరు. రక్తంపంచి ప్రాణంపోసి.. చేయిపట్టి జీవితాన్ని ఇచ్చిన అమ్మ తమను వదిలి వెళ్లినా.. ఆ మాతృమూర్తికి చిహ్నంగా అమ్మయాదిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన చాలా మంది పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనాథాశ్రమాలు.. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారిని చేరదీస్తున్నారు. కొందరు అనాథ పిల్లలకు అమ్మగా మారుతుండగా.. మరికొందరు అనాథవృద్ధుల్లో తమ తల్లులను చూసుకుంటున్నారు. అమ్మకు ప్రేమతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారిపై మాతృదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..!!

రంగినేని ఎల్లమ్మ పురస్కారాలు




2021లో రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని వెంకట్ సిద్ధారెడ్డికి అందిస్తున్న 'సాక్షి' ఎడిటర్ వర్ధెల్లి మురళి(ఫైల్)

సిరిసిల్ల:అమ్మ యాదిలో కవులు, రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా సాహిత్యపు పండగను సిరిసిల్ల శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో నిర్వహిస్తారు. రంగినేని ఎల్లమ్మ పేరిట ఆమె తనయుడు రంగినేని మోహన్‌రావు రెండు దశాబ్దాలుగా సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.తల్లిదండ్రులు లేని పిల్లలకు రంగినేని సుజాత మోహన్‌రావు ట్రస్ట్ అండగా నిలుస్తోంది.1,243 మంది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించారు. 151 మంది ఉద్యోగాలు సాధించారు. పిల్లలు, వృద్ధుల కోసం ట్రస్ట్ నిర్వహిస్తున్నాం అని వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు వివరించారు.

చదువులకు భరోసానిస్తూ..



పాఠశాలకు డెస్కులు అందిస్తున్న గంగప్రసాద్

కథలాపూర్(వేములవాడ):తల్లి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేశారు కథలాపూర్ మండలం తాండ్ర్యాలకు చెందిన అన్నదమ్ములు గుజ్జెటి గంగప్రసాద్, గుజ్జెటి శ్రీనివాస్. గంగప్రసాద్ ముంబయిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేస్తున్నాడు. తల్లి గుజ్జెటి శంకరవ్వ 20ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. తల్లి జ్ఞాపకార్థం 'గుజ్జెటి శంకరవ్వ' ట్రస్ట్ ఏర్పాటు చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు సౌండ్ సిస్టమ్స్, కంప్యూటర్లు, డ్యూయల్ డెస్కులు అందించారు.

అమ్మ గుర్తుగా..


జ్యోతినగర్(రామగుండం): గోదావరిఖని ఎల్కలపల్లి గేట్‌ప్రాంతానికి చెందిన దాసరి మహేశ్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. కష్టపడి మంచం పట్టిన తల్లిని చూసుకున్నాడు. కొన్నాళ్లకు తల్లి కూడా తుదిశ్వాస విడిచింది. అభాగ్యులకు అమ్మపేరిట సాయం చేయాలని సంకల్పించి 2012లో తల్లి 'ప్రేమలత' పేరుతో 'ప్రేమ' చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశాడు. ప్రయివేటు ఉద్యోగం చేసే మహేశ్ తనకు వచ్చే వేతనం నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు సామాజిక కార్యక్రమాలకే వెచ్చిస్తున్నాడు. అనాథల ఆకలి తీరుస్తున్నాడు. పేద పిల్లల చదువుకు సాయం చేస్తున్నాడు. వృద్ధులను చేరదీస్తున్నాడు. ఈయన సేవలు గుర్తించి పలు సంఘాలు జాతీయ అవార్డులతో సత్కరించాయి.



ట్రస్టులో సేవలందిస్తున్న మహేశ్

ఆకలి తీరుస్తూ..

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలోని విజయపురికాలనీకి చెందిన గోదరి జితేందర్ తన అమ్మపేరిట నిర్వహిస్తున్న నిత్యాన్నదానం 899రోజుకు చేరుకుంది. రెండేళ్లవయస్సులోనే తల్లిని కోల్పోయిన జితేందర్ అమ్మ కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో 2016 ఫిబ్రవరి 15న 'గోదరి కాంతలక్ష్మీ సేవా సమితి' ఏర్పాటు చేశాడు. అన్నార్థులు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యులకు 2020 నవంబర్ 27 నుంచి నిత్యాన్నదానం నిర్వహిస్తున్నాడు. ప్రతీరోజు 50 నుంచి 70మందికి కడుపునిండా భోజనం అందిస్తున్నాడు. వైద్య, రక్తదాన శిబిరాలు, ఓటరు, పర్యావరణంపై అవగాహన, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఒంట్లో జీవం ఉన్నంతవరకు అమ్మపేరిట సేవ చేస్తా అని జితేందర్ చెప్పుకొచ్చాడు.





నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న జితేందర్

నేడు చీరల పంపిణీ

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన గంగిశెట్టి మధురమ్మకు ఐదుగురు కొడుకులు. చిన్నకొడుకు జగదీశ్వర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవలే జమ్మికుంట పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందాడు. తల్లి మధురమ్మ 14ఏళ్ల క్రితం మృతి చెందింది. 2017లో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేశాడు. ఇప్పటివరకు రూ.40లక్షలు సేవా కార్యక్రమాలకు వెచ్చించాడు. 26మండలాల్లో రూ.2లక్షల విలువ చేసే 7వేల పరీక్ష ప్యాడ్లు, 76పాఠశాలలో ప్లేట్లు, డిక్షనరీలు, క్రీడా సామగ్రి, నోట్‌బుక్స్, తదితర సామగ్రి అందించాడు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా 200మంది మహిళలకు అమ్మ జ్ఞాపకంగా చీరలు పంపిణీ చేయనున్నట్లు జగదీశ్వర్ తెలిపారు.




గతేడాది మదర్స్ డే సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

అమ్మ ఒక సముద్రం

- ప్రముఖ కథ రచయిత కెవి.నరేందర్

జగిత్యాల: అమ్మ గురించి ఎవరెంత రాసినా.. సముద్రాన్ని దోసిళ్లతో తోడినట్టే అంటున్నారు ప్రముఖ రచయిత కేవీ.నరేందర్. అమ్మపేరుతో 20ఏళ్ల క్రితం తన తొలికథ సంకలనాన్ని వెలువరించారు. ఆ సంపుటి నరేందర్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఆ కథలు రాయడానికి గల స్ఫూర్తిని మదర్స్‌డే సందర్భంగా 'సాక్షి'తో నరేందర్ పంచుకున్నారు. '20 ఏళ్ల క్రితం మంథని డివిజన్‌లోని ఓ గ్రామానికి సర్పంచ్ ఎలక్షన్ల డ్యూటీకి వెళ్లాను. ఓ ముసలావిడ రెండు గుర్తుల పైన ఓటు వేసింది. అది గమనించిన నేను అవ్వ ఓటు చెల్లదేమో? అన్నాను. పోటీ పడుతున్నది ఇద్దరు నా కొడుకులే అని ఓటు డబ్బాలో వేసి వెళ్లిపోయింది. ఆ ఓటు చెల్లకపోవచ్చు. కానీ తల్లి ప్రేమకు అంతకన్న గొప్ప నిదర్శనం ఏమి ఉంటుంది. అదే విషయాన్ని అమ్మను పంచుకుందాం పేరుతో కథగా మలిచాను. ఇది 'ఆటా' అమెరికా తెలుగు అసోసియేషన్ సంఘం వారు ప్రత్యేక సంచికలో వేశారు. మండలాధ్యక్షురాలిగా ఉన్న ఇద్దరు పిల్లల తల్లి మూడోసారి గర్భం ధరించగానే ప్రత్యర్థులు అవిశ్వాసం పెట్టారు. భర్తను తిట్టయినా పదవీని వదులుకుంది గానీ గర్భాన్ని తీయించుకోలేదు. ఆదిలాబాద్ జిల్లా వెన్నెల మండలంలో జరిగిన సంఘటన ఇదీ. దీని ఆధారంగానే అవిశ్వాసం అనే కథ రాశాను. ఓల్డేజీ హోమ్‌లు ప్రతి నగరంలో విస్తరించడాన్ని ఒక తల్లి సమర్థిస్తే ఆశ్చర్యపోయాను. పిల్లల మనస్తత్వాన్ని తల్లి మాత్రమే అంత గొప్పగా విశ్లేషించగలదని అర్థమయ్యాక 'సాక్షి'లో రెక్కలు అనే కథ రాశాను. అమ్మ కథ సంకలనంలోని 14కథలు ఇలాంటి స్ఫూర్తితో రాసినవే'. అని నరేందర్ వివరించారు.



అమ్మ కథ సంపుటి



కెవి.నరేందర్

అమ్మ నాకు బెస్ట్ ఫ్రెండ్

- రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): 'అమ్మ నాకు బెస్ట్‌ఫ్రెండ్.. అమ్మతో చాలా విషయాలు షేర్‌చేసుకుంట.. నా కూతురుతో కూడా నేనుబెస్ట్ ఫ్రెండ్‌గా ఉంటున్నా' అని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ తెలిపారు. 'మదర్స్‌డే' సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. అమ్మ శాంతిసింగ్ గైనకాలజిస్టు. నాన్న కృష్ణాసింగ్ సర్జన్. అమ్మనాన్న వయసు పెరగడంతో ప్రస్తుతం అమెరికాలోని మా బ్రదర్స్ దగ్గర ఉంటున్నారు. అమ్మనాన్న ఇద్దరూ డాక్టర్ కావడంతో నేను కూడా డాక్టరయ్యాను. నా భర్త కూడా డాక్టర్. దీంతో మా కూతురు కూడా మెడిసిన్ చేసింది. మాకు ఇద్దరు కుమారులు, కూతురు. పెద్ద బాబు ఐదేళ్ల క్రితం కేన్సర్‌తో మరణించాడు. అప్పుడు చాలా డిప్రేషన్‌కు గురయ్యాను. అమ్మ నన్ను చాలా ఓదార్చింది. మేం కలిసినప్పుడల్లా ఇద్దరిలో నవ్వులే ఉంటాయి. మా కూతురుతో కూడా ఫ్రెండ్‌గా ఉంటున్న. ప్రొఫెషనల్‌గా నేను బిజీగా ఉన్నప్పటికీ నాకు హెల్ప్‌గా ఉంటూ చాలా ఫ్రీడం ఇస్తుంది. ప్రస్తుత జనరేషన్ పిల్లలు అమ్మకున్న ఇబ్బందులు తెలుసుకోవాలి. అమ్మ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండకుండా అన్నిపనుల్లో తోడుగా ఉండాలి.



డాక్టర్ హిమబిందు సింగ్

వడదెబ్బతో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌కు చెందిన గందం దుర్గయ్య (60) వడదెబ్బతో మృతిచెందాడు. దుర్గయ్య చిలుక జోస్యం చెప్పడానికి శనివారం సైకిల్‌పై వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నర్సింగాపూర్ శివారు కాలువ వద్ద అస్వస్థతతో మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటకీయంలో మనోళ్ల పాత్ర అదుర్స్

- కాంగ్రెస్ గెలుపులో జిల్లా నేతల కీలకపాత్ర
- శ్రీధర్ బాబు నేతృత్వం వహించిన నియోజకవర్గాల్లో విక్టరీ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కర్ణాటకలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించి చరిత్ర సృష్టించింది. శనివారం విడుదలై ఫలితాలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాయి. పొరుగు రాష్ట్రం కావడం, మన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలలే సమయం ఉండటంతో ఈ ఎన్నికల ప్రభావం మన రాష్ట్రంపైనా ప్రభావం చూపిస్తుంది. ఆ మేరకు సంబంధాలు ఉన్నాయి కాబట్టే.. అక్కడ మన రాష్ట్రం నుంచి అందులోనూ ఉమ్మడి జిల్లాల నుంచి బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి పలువురు నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహించి వచ్చారు. ఎవరెవరు ఎక్కడ ప్రచారం చేశారో ఒకసారి పరిశీలిద్దాం.!

- కర్ణాటకలోని గుల్బర్గా, బీదర్, యాదగిరి నియోజకవర్గాల్లో జగిత్యాల జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షుడు ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపొందింది.
- మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్ బాబు కళ్యాణ కర్ణాటకకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఏఐసీసీ కార్యదర్శి మల్లికార్జున కార్గే ఏరియాలోని ఏడు జిల్లాలో 41 అసెంబ్లీ నియోజకవర్గాలకు శ్రీధర్ బాబు ఇన్‌చార్జిగా ఉన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు ముందు నుంచి ఇక్కడి రాష్ట్రంలో శ్రీధర్ బాబు పార్టీ వ్యవహారాల్లో సమన్వయం చేస్తున్నారు.
- నిజాంబాద్ మాజీ ఎంపీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాలుపంచుకున్నారు.
- పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ప్రచారం నిర్వహించిన కళ్యాణ్ గుల్బర్గాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.

కమలనాథులకు ప్రతికూలమే..!

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొనసున్నారు. కల్బూర్గి రూరల్ జిల్లా సేడం, చించోలి నియోజకవర్గాలలో ప్రచారం చేశారు. చించోలిలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించగా, సేడంలో కాంగ్రెస్ గెలిచింది. మధుగిరి జిల్లాలోని సిర, మధుగిరి, పవగడ నియోజకవర్గాల ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఈ మూడింట్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది.

- కర్ణాటకలో బండి సంజయ్.. చింతామణి, ముల్బగల్, బాగేపల్లి, గౌరీబిదనూర్, చిక్కబల్లాపూర్ స్థానాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగు ప్రజలు అధికంగా ఉన్న కోలార్, చింతామణి, ముల్బగల్ నియోజకవర్గాల్లో బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది. ఇక గౌరీబిదనూర్‌లో అయితే ఏకంగా ఐదో స్థానానికి.. బాగేపల్లి, చిక్కబల్లాపూర్‌లో భారీ వ్యత్యాసంతో ఓటమి చవిచూసింది.

సుపారీ గ్యాంగ్ అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ ఆరీఫ్ అలీఖాన్

జగిత్యాలక్రైం: జిల్లాలోని బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన నారపాక కమలాకర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురు సుపారీ గ్యాంగ్ నిందితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. కమలాకర్ ఈనెల 7న ఉదయం తన కుమార్తెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని కమ్మునూర్ మీదుగా దస్తూరాబాద్ వెళ్తుండగా కమ్మునూర్ చౌరస్తా దాటిన తర్వాత జీపులో ఉన్న ఇద్దరు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టి కత్తులతో కమలాకర్‌పై దాడిచేయగా తప్పించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బీర్‌పూర్ ఎస్సై అజయ్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. ఈనేపథ్యంలో కండ్లపల్లికి చెందిన నారపాక రమేశ్, అతడి సోదరుడు కమలాకర్ మధ్య ఆస్తి తగాదాలున్నాయి. కమలాకర్‌ను చంపాలని రమేశ్ తన బంధువు గొల్లపల్లికి చెందిన కొంద్ర చంద్రయ్యకు చెప్పాడు. దీంతో చంద్రయ్య జన్నారంకు చెందిన షేక్ రియాజ్ సుపారీ గ్యాంగ్‌తో రూ.4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. షేక్ రియాజ్ అతడి తమ్ముడు ఇలియాజ్, మిత్రులు మహ్మద్, బుచ్చన్న, సంపత్ ప్రణాళిక సిద్ధం చేశారు. 7న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కమలాకర్‌ను రమేశ్, చంద్రయ్య జగిత్యాలలో ఉండి గమనించారు. రియాజ్‌ను కమ్మునూర్ గ్రామ శి వారులో ఉండమని సమాచారం అందించారు. కమలా కర్ వచ్చే విషయమై జీపులో ఉన్న ఇలియాజ్, మహ్మద్‌కు సమాచారం అందించారు. ఇలియాజ్ జీపు నడుపుతూ కమలాకర్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. కిందపడ్డ అతడిపై కత్తులతో దాడిచేయగా తప్పించుకున్నాడు. ఆ సమయంలో జరిగిన పెనుగులాటలో ఇలియాజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో శనివారం మధ్యాహ్నం జన్నారంకు చెందిన షేక్ రియాజ్, మహ్మద్ షేక్, గొల్లపల్లికి చెందిన కొంద్ర చంద్రయ్య, నిజామాబాద్ జిల్లా ఎదురుగట్లకు చెందిన జాడి బుచ్చన్న, మొలంగూర్ సంపత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు నారపాక రమేశ్, షేక్ ఇలియాజ్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని మేడిపల్లి గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మాడ హన్మండ్లు (40)అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాలు.. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం మల్లారం గ్రామానికి చెందిన మాడ హన్మండ్లు, కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం చిన్నదేవడ గ్రామానికి చెందిన దుర్కి లక్ష్మణ్ ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి నుంచి నిజామాబాద్ వెళ్తున్నారు. మేడిపల్లి వద్ద ఆటో ఢీకొనడంతో హన్మండ్లు మృతిచెందగా, దుర్కి లక్ష్మణ్‌కు గాయాలు కావడంతో మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉమసాగర్ పేర్కొన్నారు.

తెలంగాణ ఇక కాంగ్రెస్‌దే..

గొల్లపల్లి: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ జెండా ఎగురవేస్తుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జోస్యం చెప్పారు. శనివారం మండల కేంద్రంలో టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేలా సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. నాయకులు ముస్కు నిషాంత్‌రెడ్డి, బీమ సంతోష్, తాండ్ర సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

తేమ పేరిట మిల్లర్ల దోపిడీ

ధర్మపురి: తేమ పేరిట మిల్లర్లు ధాన్యంలో కోత విధిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. కమలాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల తరపున కాంగ్రెస్ పోరాటం



బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ రద్దు కోసం కాంగ్రెస్ ప్రజల తరపున పోరాటం చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. శుక్రవారం స్తంభంపల్లి, పాశిగామలో నిర్వహించిన ఇథనాల్ పరిశ్రమపై అవగాహన సదస్సుకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హాజరు కావడంపై స్పందిస్తూ.. ఆయన క్రిభ్‌కో కంపెనీ డైరెక్టర్‌గానే సదస్సుకు హాజరయ్యారని, కాంగ్రెస్ నేతగా రాలేదన్నారు. పొన్నం సదస్సుకు హాజరై మాట్లాడడంపై పార్టీ అధిష్టానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సర్పంచ్ మేరుగు మురళిగౌడ్, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.